

# కలకంఠి కథలు

## - శ్రీధర



ఈ కథల గురించి:

*1992లో ఈనాడులో వసుంధర పేజీ ప్రారంభించారు. స్త్రీలకు సంబంధించిన అంశాల కోసం. రామోజీరావు గారి సూచనలతో ఎడిటర్ వర్మగారు ప్రతి గురువారం ఒక వుమన్ ఓరియెంటెడ్ ఆర్టికల్ ఉండాలని నిర్ణయించారు. అప్పటికే శ్రీధర విష్ణుప్రియ కాలమ్ రాస్తున్నారు. అందుచేత స్త్రీలకు ఆసక్తికరంగా ఉండే ఒక ఆర్టికల్ రాయమని శ్రీధరని అడిగారు. మర్నాడు ఆర్టికల్ రాసిచ్చారు. దానిపేరు 'అమ్మకు ఎన్నడన్నా థాంక్స్ చెప్పారా?', బాగానే ఉందనిపించినా, రెస్పాన్స్ ఎలా ఉంటుందో నన్న చిన్న అనుమానం వర్మగారికి ఉండనే ఉంది. కానీ ఆ రాత్రి కంపోజింగ్ చేసినవాళ్లూ, పేజీ మేకప్ చేసినవాళ్ళు 'ఆగి, కళ్లు తుడుచుకున్నాం 'అని చెప్పినప్పుడు ఆయన అనుమానం నివృత్తి అయింది. అచ్చయ్యాక, చదివిన ప్రతివాళ్లూ, అవునూ, మా అమ్మ మా కోసం ఎంతో చేసింది, థాంక్స్ చెప్పాలన్న ఆలోచనే రాలేదు ' అని అన్నారు. తర్వాత వరసగా నాలుగు వారాలు ఇంకా ఎన్నాళ్లు నాకీ సంకెళ్ళు? 'దయచేసి అనాగరికుల అడ్రస్ చెప్పండి, 'ఇల్లాలి హృదయవేదనా నివేదన 'రాశారు. అనూహ్యమైన స్పందన వచ్చింది. 'నేను వ్యాసాలు రాయించాలనుకున్నాను, మీరు రాసిన వ్యాసాలు కథల్లానే ఉంటున్నయి, ఇంక కథలే రాయండి...' అన్నారు వర్మగారు. స్త్రీలకు సంబంధించిన పేజీ కనుక 'మల్లిక' పేరుతో ప్రతి గురువారం ఒకటి కాదు, రెండు కాదు నాలుగు వందల ఆణిముత్యాల్లాంటి కథలు ఒక దశాబ్దం పాటు ఏకబిగిన రాశారు. చాలా మందికి ఎవరీ మల్లిక, అన్న ప్రశ్న ఎదురైంది. ఈనాడుకు ఫోన్ కాల్స్ చేసినవారిలో ఎంతో మంది ప్రముఖులూ ఉన్నారు.*

*ఎందరో సాహిత్యాభిమానులను గురువారం ఉదయం కోసం వసుంధర పేజి కోసం ఎదురు చూసేలా ఆసక్తి కలిగించిన శ్రీధర (మల్లిక) కథలు, కౌముది పాఠకుల కోసం ముఖ్యంగా నవతరం కోసం... ప్రతి నెలా.. చదవండి.!!*

# పరీక్ష

శ్యామలరావు సెక్షన్ లోకి రాగానే అందరి వంకా చూసి, సూపర్నెంట్ ఎవరో తెల్సుకుని వెళ్ళి ఆయన పక్కన కూర్చుని ఆయనతో రహస్యంగా మాట్లాడాడు.

ఇక్కడికి వచ్చే వాళ్ళు ఏ పని మీద వస్తారో అందరికీ తెల్సు. భార్గవి శ్యామలరావు వంకే చూస్తోంది. ఒకప్పుడు ఆయన దగ్గర చదువుకుంది. ఏదన్నా రెండు ముక్కలు నేర్చుకున్నదీ అంటే అది ఆయన చలువే. పుస్తకాల్లోని పాఠాలు మాత్రమే గాక జీవిత సత్యాలనూ ఆయన ఎన్నో వివరించేవాడు.

ఆయన చెప్పిన మాటలు ఎప్పటికీ మర్చిపోలేదు. "మీరంతా పరీక్షలనే సమరానికి సిద్ధమవుతున్న సైనికులు. పరీక్షలు ఈ నెలతో అయిపోతాయని అనుకోకండి. జీవితమంతా పరీక్షలు ఎదురవుతూనే వుంటాయి. ఆ పరీక్షల్లో గెలవటం నేర్చుకోండి . అమ్మా నాన్నా ఆస్తి ఇవ్వని రోజున కాదు మీరు ఏడవాల్సింది. మీ కారెక్టర్ పోయిన రోజున మీరు ఏడవాలి. పువ్వుకు పరిమళం ఎలాంటిదో మనిషికి కారెక్టర్ అలాంటిది...." అని ఆయన ఆ రోజుల్లో చెప్పిన మాటలు భార్గవి ఎప్పటికీ మర్చిపోలేదు.

భార్గవి ఆయన వంక చూసింది. ఆయనలో చాలా మార్పు వచ్చింది. కొంచెం లావు అయ్యారు. జుత్తు నెరిసింది. సూపర్నెంట్ ఏదో చెప్పినట్లున్నాడు. ఆయన భార్గవి దగ్గరికి వచ్చాడు. మాస్టారి మీద ఉన్న గౌరవం కొద్దీ లేచి నిలబడింది. నమస్కారం చేసింది.

"నేను శ్యామలరావు ను. డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ ని. మా కాలేజ్ రికగ్నిషన్ కోసం అప్లయ్ చేసాం. మీరు పుటప్ చేస్తారని చెప్పారు." అన్నాడు శ్యామలరావు.

"సర్, నేను మీ ఓల్డ్ స్టూడెంట్ ని. మీ దగ్గరకు ట్యూషన్ కి వచ్చేదాన్ని. మీ దగ్గర నేర్చుకున్నదే అసలైన చదువు అని నేను ఎప్పుడూ అనుకుంటూ వుంటాను." అన్నది భార్గవి.

శ్యామలరావు చాలా సంతోషించాడు. "నీ లాంటి స్టూడెంట్ దొరకటం నా అదృష్టం." అన్నాడాయన.

మాస్టారికి కుర్చీ చూపించింది. టీ తెప్పించింది. ఆయన యోగ క్షేమాలన్నీ విచారించింది. ఆయన భార్గవి వివరాలు తెల్సుకున్నాడు.

"నాకు వివాహం అయింది. ఒక పాప. మీరు ఒకసారి చెప్పారు. ప్రతి వాళ్ళతోను, ముఖ్యంగా అర్ధాంగి తోను, అంతరాత్మ తోను సత్సంబంధాలను కొనసాగించాలని అన్నారు. ఎన్నోసార్లు తొందర పడబోయినప్పుడు మీ మాటలు గుర్తు వచ్చి జాగర్త పడిన సందర్భాలు వున్నాయి. " అన్నది భార్గవి.

"చాలా సంతోషం. మేము ఎన్నో చెబుతుంటాము. అవన్నీ గుర్తు పెట్టు కుని అచరించటం నీ గొప్పదనం... " అన్నారాయన.

అయన వెళ్ళిన కాసేపటికి అయన కాలేజ్ కి సంబందించిన ఫైల్ భార్గవి దగ్గరికి వచ్చింది. అందులోని విషయాలు చదివాక అమెకు మతి పోయినంత పని అయింది.

ఆయన నడుపుతున్న కాలేజ్ మీద అనేక అరోపణలున్నాయి. సరి అయిన బిల్డింగ్ లేదు. రూల్స్ ప్రకారం ఉండవల్సిన వాటిల్లో ఏ ఒక్కటీ లేదు. తగినంత మంది లెక్చరర్స్ లేరని, పాఠాలు సరిగా చెప్పటం లేదని చాలా అరోపణలు వచ్చాయి. స్టూడెంట్స్ దగ్గరి నుంచి వేలకు వేలు వసూలు చేస్తున్నారని ఫిర్యాదులు వున్నయి.

ఇలాంటి కాలేజ్ కి ఎట్టి పరిస్తితుల్లోను రికగ్నిషన్ ఇవ్వకూడదని రూల్స్ చెబుతున్నయి. ఇవన్నీ చదివాక ఆయన మీద వున్న సదభిప్రాయం సడలిపోయింది. నీతికి నిజాయితికి ప్రతి రూపంగా కనిపించిన మనిషిలో ఇంతటి అవినీతి పరుడు దాక్కునిని వున్నడా ? దానాలు అన్నిటి లోకి విద్యాదానం గొప్పది అని చెప్పిన ఆయన విద్యతో ఇంతటి దారుణమైన వ్యాపారం చేస్తున్నాడా ?

ఇప్పటిదాకా ఆయన మీద వున్న గౌరవం అంతా పోయి, అసహ్యం ఏర్పడింది.

శ్యామలరావు మర్నాడు వచ్చాడు. సూపర్నెంట్ తొ మాట్లాడాడు. ఇద్దరూ హొటెల్ లొ లంచ్ చేసారు. టెర్మ్స్ మాట్లాడు కున్నారు.

"ఆమె మీ స్టూడెంట్ అంటున్నారు గనుక ఆమె సంగతి మీరే చూసుకొండి." అన్నాడు సూపర్నెంట్.

మధ్యాహ్నం పై ఆఫీసర్ పిల్చి శ్యామలరావు ఫైల్ పుటప్ చెయ్యమని చెప్పాడు. శ్యామలరావు రోజు వచ్చి అమెను కల్సుకుంటూనే వున్నాడు.

అన్ని అవకతవకలు వున్న కాలేజ్ విషయంలో ఆయనకు అనుకూలంగా రాయటానికి ఆమెకు మనసు ఒప్పుకొవటం లేదు.

"ఇంతకు ముందు వచ్చినవి చాలా వున్నయి. వరుసగా చూస్తున్నాను " అన్నదామె.

మర్నాడు సాయంత్రం శ్యామలరావు అమె ఇంటి ముందు కారు దిగాడు. నవ్వుతూ లోపలికి వచ్చాడు. భార్గవి ఆయనకు తన భర్త ప్రవీణ్ ను పరిచయం చేసింది. కాసేపు లోకాభి రామాయణంతో కాలక్షేపం జరిగాక, ఇంక ఆయన అసలు విషయం లోకి వచ్చాడు.

స్వీట్ పాకెట్ తొ పాటు యాభై వేలు దబ్బు వున్న మరో కవరు వాళ్ళ ముందు పెట్టాడు.

"ఇవి ఎందుకు తెచ్చారో మీకు తెల్సు, నాకు తెల్సు. కానీ మాస్టారూ ఒకప్పుడు మీరు ఇచ్చిన స్ఫూర్తిని నేను మర్చి పోలేను. మనిషికి వ్యక్తిత్వం ముఖ్యం. ఇంతవరకు నేను ఎప్పుడు నా మనసుకు నచ్చని పని చెయ్య లేదు. ఏ గురువు ప్రబోధంతో జీవితాన్ని సరిఅయిన మార్గంలో నడపు కుంటున్నానో ఆ గురువు కారణం గానే నేను నా వ్యక్తిత్వాన్ని చంపుకోలేను. మీ విషయం లో నేను ఏమీ చేయలేను. నన్ను మన్నించండి " అన్నది భార్గవి.

"భార్గవీ, ఇప్పుడు నీతి నియమాలకు అర్థాలు మారి పొయ్యాయి. దీపం వుండగానే ఇల్లు చక్కబెట్టుకోవలన్నది ఇవాల్టి రూల్. ఉన్నత పదవుల్లో వున్నవారి దగ్గరి నుంచీ అటెండర్ దాకా ఎవరికి ఎంత దొరికితే అంత తినేస్తున్నారు. ప్రపంచం డబ్బు చుట్టూ తిరుగుతోంది. డబ్బు సంపాదించటానికి ఉపయోగ పడేదే అసలైన విద్య.... ఇది ఇవాల్టి నీతి." అన్నాడు ఆయన.

"క్షమించండి. నాది పాత కాలం చదువు. నాకు అది చాలు" అన్నది భార్గవి.

ఆయన లేచాడు. వెళ్ళి కారు లో కూర్చున్నాడు. భార్గవి ఆయన తెచ్చిన ప్యాకెట్లు తీసుకెళ్ళి కారులో పెట్టింది. కారు వెళ్ళి పొయింది.

ఒకప్పటి ఆయన మాటలే గుర్తు వొస్తున్నయి. 'రోజూ పరీక్షలు ఎదురవుతూనే వుంటాయి. ఎన్నో ప్రలోభాలకు గురి చేస్తూనే వుంటాయి. అమ్మా నాన్నా ఆస్తి ఇవ్వని రోజున కాదు, మీరు కారెక్టర్ పోగొట్టుకున్న రోజున మీరు ఏడవాలి...అన్ని ఆదర్శాలు చెప్పిన ఆయన ఇవాళ తనే వాటికి తిలోదకాలు ఇవ్వటం ఆశ్చర్యంగా వుంది....'

నిజానికి భార్గవికి ఇప్పుడు డబ్బు చాలా అవసరం. రెండు రోజుల్లో కూతురుకు డొనేషన్ కట్టాలి. ప్రలోభాలు జీవితం పొడుగునా వుంటూనే వుంటాయి. వాటికి లొంగి పోతే మనిషికి విలువ ఏముంది ... అనుకున్నది భార్గవి.

మర్నాడు వుదయం ఆమె తన సీటు దగ్గరికి వెళ్ళేటప్పటికి ఆమెను ఆ సెక్షన్ నుంచి మరో సెక్షన్ కు బదిలీ చేసినట్లు ఉత్తరువులు వచ్చాయి.

కాసేపటికి ఆయన ఆమె ముందు నుంచి వెళ్తూ క్షణం సేపు ఆగాడు. ఆమె ఆయనతో అన్నది.

"థాంక్స్ మాస్తారూ, ఇంతవరకు నేను ఎప్పుడూ పరీక్షల్లో ఫెయిల్ కాలేదు. ఇప్పుడు తప్పుతానేమో నని భయ పడ్డాను. నన్ను ఆ ప్రమాదం నుంచి తప్పించినందుకు థాంక్స్,"

ఆయన నవ్వి వెళ్ళి పోయాడు. రెండు రోజుల తరువాత అయనకు కావల్సిన విధంగా వుత్తరువులు వచ్చాయి.

(వచ్చేనెల మరో కథ)

**Click here to share your comments on this story.**